క్లుప్తంగా

బురదమయంగా మట్టి రోడ్డు



ధ్వంసమైన రోడ్డు

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని పెద్దాపూర్ శివారులో పిట్లలవాడకు వెళ్లే ప్రధాన మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిందని, దీంతో కాలినడకన సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. అలాగే ఇటీవల చెరువులో తీసిన పూడికను రోడ్డుపై వేయడంతో రోడ్డంతా దారుణంగా తయారైందన్నారు. ఆ తర్వాత వాహనాలు వెళ్లడంతో మట్టిరోడ్డుపై నడవలేని పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు స్పందించి మట్టిరోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కూచారంలో ఉచిత వైద్య శిబిరం



కూచారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సీఎమ్మార్ బృందం

మనోహరాబాద్(తూప్రాన్): సీఎమ్మార్ ఆస్పత్రి సహకారంతో మండలంలోని కూచారం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉదయ్‌రంజన్‌గౌడ్ మాట్లాడుతూ తన తండ్రి కీ.శే. నాయిని రాజేందర్ ప్రసాద్‌గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహించిన శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశామన్నారు. సహకరించిన ఆస్పత్రి చైర్మన్ గోపాల్‌రెడ్డి, సీఎంఆర్ ఆస్పత్రి మేనేజర్ దుర్గప్రసాద్‌రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అశోక్, వైష్ణవి, అనిల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింలుగౌడ్, విఠల్‌యాదవ్, నాయకులు నరేశ్, కృష్ణ, రాజునాయక్, సాయిగౌడ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

నర్సాపూర్: నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలలో ఆదివారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ కవి తులసీదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణ కిశోర్, వైస్ ప్రిన్సిపాల్ బసవరాజ్ తదితరులు హిందీ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరు పక్కనున్న, గుట్టపైన స్వయంభుగా కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి ప్రధాన అర్చకుడు ధనుంజయ్ శర్మ, విద్యాకర్‌చారి ప్రత్యేక పూజలు చేశారు.

కేంద్ర పథకాలను వివరించండి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పట్టణ పరిధిలోని బీజేపీ అధ్యక్షుడు ఐలేష్ ఆధ్వర్యంలో ఆదివారం సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ నాయకులు నర్సింగ్ రావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు ప్రజలతో స్నేహాభావంతో మెలగాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రవీందర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మోక్షమెప్పుడో?

కనిపించని పానాది రోడ్లు
- పిచ్చిమొక్కలతో నిండిన దారులు
- హద్దులు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు
- పలుచోట్ల కబ్జాలకు గురవుతున్న వైనం



పిచ్చిమొక్కలతో నిండిన శివ్వంపేట-చండీ పానాది రోడ్డు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఉన్న పానాది రోడ్లు (నక్షబాట) కనిపించడం లేదు. ఈ దారులన్నీ రోజురోజుకు పిచ్చిమొక్కలతో మూసుకపోతున్నాయి. దీంతో పలు గ్రామాలకు, వ్యవసాయ పొలాలకు రాకపోకలు కొనసాగేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసుకున్న పానాది రోడ్లు పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో పాటు అక్రమాలకు గురవుతున్నాయి. ఈ నక్షబాటలు పలు గ్రామాలకు దూరభారం తగ్గడంతోపాటు రాకపోకలు కొనసాగించేందుకు అనువుగా ఉండేవి. ప్రస్తుతం ఈ దారులు మూసుకపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గతంలో బండ్లబాటగా పిలిచే పానాది రోడ్లు కాలక్రమేనా పిచ్చిమొక్కలతో నిండిపోవడంతో ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతున్నాయి.

ఈజీఎస్ ద్వారా అవకాశం..

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ నక్షబాటలకు మట్టి పనులు చేసేందుకు అవకాశం ఉంది. అందులో కూలీలతో పనులు చేపట్టి రాకపోకల పునరుద్దరణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే రెవెన్యూ రికార్డుల పరంగా నక్షబాటలు ఉన్నప్పటికీ వాటిని పునరుద్ధరించడంలో సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.



పొలాలకు నక్షబాట నుంచి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో నిలిపిన బైక్‌లు

చర్యలు చేపట్టాలి



నక్షబాటలను పునరుద్ధరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలి. గతంలో ఉన్న పలు పానాది రోడ్లు పిచ్చిమొక్కలతో మూసుకుపోయాయి. దీంతో రాకపోకలు జరగడం లేదు. వాటిని పునరుద్ధరిస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– అర్జున్, రైతు, శివ్వంపేట

సర్వే చేయాలి



మండల వ్యాప్తంగా ఉన్న పానాది రోడ్లకు సంబంధించి రికార్డుల పరంగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా పలు గ్రామాలకు, పొలాలకు వెళ్లేందుకు పానాది రోడ్లు ఉపయోగకరంగా ఉంటాయి.

– మల్లేష్, శివ్వంపేట

వివరాలు ఇవ్వాలి



మండలంలో పానాది రోడ్లు అన్యాక్రాంతమయితే రైతులు ఫిర్యాదు చేయాలి. దీంతో వెంటనే సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేస్తాం. మూసుకుపోయిన పానాది రోడ్లను వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– కమలాద్రి, తహసీల్దార్, శివ్వంపేట

వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ



ముస్లాపూర్ పాఠశాలలో చెట్టు నేలకొరిగి ప్రహరీ కూలిన దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని ముప్పారం, ముస్తాపూర్ జెడ్పీ పాఠశాలల ప్రహరీలు కూలిపోయాయి. ముస్లాపూర్ పాఠశాల ఆవరణలో ఉన్న చెట్టు నేలకొరిగి, ప్రహరీ సైతం కూలిపోయింది. ప్రహరి లేకుంటే పశువులు, పందులు పాఠశాల ఆవరణలోకి వస్తాయని స్థానికులు తెలిపారు. పాఠశాల ప్రహరీలకు నిధులు మంజూరు చేసి వెంటనే నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘన

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల(సిద్దిపేట): జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో భాగమైన చేర్యాల మండల పరిధిలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘించి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేయనున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. అయితే చెప్పినట్లుగా ఆదివారం మండలంలోని కాశగుడిసెలులో భవన నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి కొమ్మూరి శంకుస్థాపన చేశాడు. ఈ విషయాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ప్రొటోకాల్ ఉల్లంఘన చేస్తున్న తీరును ఎమ్మెల్యే తెలియజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ మండల స్థాయి అధికారులకు ఫోన్ చేసి ప్రొటోకాల్ సమస్య రాకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలను అధికారులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి తెలియజేయడంతో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు రద్దు చేసుకున్నారు. అయితే కార్యకర్తలు మాత్రం అభివృద్ధి పనులు పరిశీలించారని తిరిగి పోస్టులు పెట్టడం గమనార్హం.

42 ఏళ్లకు మళ్లీ కలిశారు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 42 ఏళ్ల తర్వాత కలిశారు. 1982–83లో ఎస్సెస్సీలో చదువుకున్న పూర్వ విద్యార్థులందరూ కలిసి ఒకే వేదికపై కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆదివారం అందరూ కలిసి తమ పాఠశాల రోజులను గుర్తుచేసుకుంటూ ఆనందించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రంగారెడ్డి, సత్తయ్యలను ఘనంగా సన్మానించారు.



పెద్దశంకరంపేటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రోడ్లు ధ్వంసం.. ప్రయాణికుల ఇక్కట్లు



గుంతల రోడ్డుపై వెళ్తున్న వాహనాలు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల పట్టణాల పరిధిలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో రవాణా అస్తవ్యస్తంగా మారి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మారుమూల గ్రామాల రోడ్లు సైతం అస్తవ్యస్తంగా మారడంతో ప్రయాణం నరకంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. జిన్నారం పట్టణ పరిధిలోని శివనగర్, గడ్డపోతారం పట్టణ పరిధిలోని మాదారం, గుమ్మడిదల పట్టణ కేంద్రం నుంచి కానుకుంట వరకు రోడ్ల దుస్థితి దారుణంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధ్వంసమైన రోడ్లపై చినుకు పడిందంటే చిత్తడిగా మారుతున్నాయి. దీంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు అనునిత్యం ఈ రోడ్డుగుండా ప్రయాణం సాగించలేక పోతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి రోడ్లు ధ్వంసమైన పట్టించుకునే నాథుడేలేడని మండిపడుతున్నారు. సమస్యపై సంబంధిత మున్సిపల్ అధికారులు, పాలకులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రయాణ వెతలు ఎప్పుడు తీరుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ధ్వంసమైన రోడ్లపై ఇప్పటికే ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా ప్రత్యేక, మున్సిపల్ అధికారులు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

'గోపా' సేవలు విస్తరించాలి

సంగారెడ్డి టౌన్: గౌడులందరూ ఏకం కావడానికి గోపా ఒకటే మార్గమని అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ అన్నారు. గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ గోపాల సభ్యులుగా చేరి అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజుగౌడ్, వీరయ్యగౌడ్, లింగాగౌడ్, విజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయ ఉప కేంద్రం ఏర్పాటు చేయాలి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని వెంకటపూర్ కే గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ మార్కెట్ ఉప కేంద్రంను ఏర్పాటు చేయాలని ఆదివారం సొసైటీ చైర్మన్ అందె కొండల్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గతంలో ఉప కేంద్రం ఏర్పాటు చేశారు. కానీ, కొన్ని అనివార్య కారణాల వల్ల తిరిగి ప్రారంభించాలని గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానించారు. గ్రామంలో యూరియా కొరత ఏర్పడటంతో గ్రామంలో తప్పనిసరిగా ఉప కేంద్రం ఏర్పాటు చేయాలని కల్వకుంట సొసైటీ చైర్మన్‌కు, డీసీవో మెదక్‌ను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావ్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శివప్ప అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

సేవా కార్యక్రమాలు చేపట్టాలి

శివ్వంపేట(నర్సాపూర్): ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, అమ్మ పేరుతో మొక్కలు నాటడం, కుల వృత్తులు, రిటైర్డ్ అధికారులను సన్మానించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కవితారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండల్ రావు, జిల్లా కార్యదర్శులు అశోక్ సాదుల, భిక్షపతి, నాయకులు వినోద్ కుమార్, కుమార్‌గౌడ్, సుధాకర్, శేఖర్, షాదుల్లా, సంజీవులు, పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డులు మంజూరు

కల్హేర్(నారాయణఖేడ్): అర్హులందరికీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తోందని మాజీ ఆత్మకమిటీ చైర్మన్ గుండు నరేందర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బండారి సాయిలు తెలిపారు. ఆదివారం మండలంలోని బీబీపేట్‌లో లబ్దిదారులకు కొత్తగా రేషన్‌కార్డులు అందజేశారు. సింగిల్ ఫేజ్ బోరు ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాబుమియ, భూమయ్య, బాలయ్య, భాస్కర్ ఉశయ్య పాల్గొన్నారు.

యూరియా కొరతపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. మండలంలో 21 వేల ఎకరాల్లో వరి పంట సాగుచేస్తుండగా.. ఇప్పటి వరకు 23,500 బస్తాల యూరియా పంపిణీ చేశారన్నారు. మండలానికి నిత్యం యూరియా వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిశామన్నారు. ప్రతిరోజు యూరియా అందుబాటులో ఉంటుందని, రైతులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం వ్యవసాయ అధికారి లావణ్య మాట్లాడుతూ మోతాదుకు మించి యూరియా వాడటంతో పంటకు తెగుళ్లు వచ్చే అస్కారం ఉందన్నారు. శివ్వంపేట, గోమారం సొసైటీల ద్వారా యూరియా పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మధు, జిల్లా రైతు రక్షణ సమితి గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్ ఉన్నారు.

ఎమ్మెల్యే చొరవతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్



కౌడిపల్లికి చేరుకున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని 132/33కేవీ సబ్‌స్టేషన్‌కు ఆదివారం 50ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చేరుకుంది. ఇక్కడ ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సదాశివపేటకు పంపించి ఈ సబ్‌స్టేషన్‌కు 16ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించారు. దీంతో కౌడిపల్లి, కొల్చారం, చిలప్‌చెడ్ మండలాల్లో లోఓల్టేజీ సమస్య నెలకొంది. ఈ విషయంపై ఇటీవల ఎమ్మెల్యే సునీతారెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన అధికారులు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకొచ్చారని, దీనిని త్వరలో బిగించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ముస్లాపూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముస్లాపూర్‌లో ఆదివారం 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంను ఘనంగా నిర్వహించారు. 30 ఏళ్ల తర్వాత కలిసిన విద్యార్థులు ఆత్మీయంగా పలకరించుకొని, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, ఆనందంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువులు రిటైర్డ్ ఎంఈఓ మోహన్ రాజు, ఆనంద్, ఆనందం, జగ్జీవన్, లింగమయ్య, కిష్టయ్య, రమాదేవి, నిర్మల, పారిజాతం టీచర్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రశాంత్, శేఖర్, సలీం, అంబదాస్, ప్రజ్వల, స్వప్న, గిరిజ, వరలక్ష్మి, మనీలా, శారద తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సేవాపక్షం సమావేశం



సమావేశానికి హాజరైన నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలో ఆదివారం బీజేపీ నాయకులు సేవాపక్షం మండల కార్యశాల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బుచ్చేష్‌యాదవ్ మాట్లాడుతూ..సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవాపక్షం కార్యక్రమాలు స్వచ్ఛభారత్, రక్తదాన శిబిరం, పేదలకు, వికలాంగులకు సహకరించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, మల్లేశం, ఉపాధ్యక్షుడు బాలకిషన్, సీనియర్ నాయకులు నర్సింలు, వెంకటేశం, జనార్దన్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నవీన్, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆదివారం ముస్లింలు ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో ఆయా పార్టీలకు చెందిన ముస్లిం నాయకులు పాల్గొన్నారు. జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీలు తీశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నర్సాపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



టేక్మాల్‌లో ర్యాలీ పాల్గొన్న ముస్లింలు



పెద్దశంకరంపేటలో..



చేగుంటలో..

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న బీజేపీ నాయకులు

కల్హేర్(నారాయణఖేడ్): కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండలంలోని ఖానాపూర్(కె)లో బీజేపీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. సిర్గాపూర్ మండలం కడ్పల్ మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, రిటైర్డు ఆర్ఐ నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు బీఆర్‌ఎస్‌లో చేరారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్‌ను ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడి సంజీవరావు, నాయకులు పాల్గొన్నారు.